

నూతన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి-నల్లజర్ల

ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులతో ప్రజలకు మరింత మెరుగైన వైద్యం అందుతుందని మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. నల్లజర్లలో స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను మంత్రి పంపిణీ చేశారు.



సభలో మాట్లాడుతున్న మంత్రి నాగార్జున

ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నూతన ఆరోగ్యశ్రీ కార్డులపై అవగాహన కల్పించేందుకు అధికారులు సహకరించాలన్నారు 2024 ఎన్నికల్లో గోపాలపురం నియోజకవర్గంలో పనిచేస్తున్న తలారి వెంకట్రావును తిరిగి గెలిపించాలని కోరారు.

ఎఫ్ఎల మెడపై పనిదినాల కత్తి

లక్ష్యం చేరుకోకపోతే వేతనం నిల్

ఆందోళనలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఉపాధి హామీ పథకం అమల్లో క్షేత్రస్థాయిలో కీలకంగా పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల మెడపై పనిదినాల కత్తి వేలాడుతోంది. దీంతో ప్రజా ప్రతనిధులను కలిసి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు వేడుకుంటున్నారు. సమస్యల పరిష్కారం, ఉద్యోగ భద్రత కోసం ఫీల్డ్ అసిస్టెంట్లు దశల వారీ పోరాటాలు చేసినా అధికార యంత్రాంగంలో, ప్రభుత్వంలో ఎలాంటి స్పందన లేదు. పని దినాలతో సంబంధం లేకుండా వేతనం ఇవ్వడం తోపాటు, జీతాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. తాజాగా పని దినాల ఆధారంగానే జీతాలు ఇస్తుండటంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా గతంలో 910 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లక్ష్యాలను చేరుకోవడంతో వెనుకపడుతూ వచ్చారు. ఈ విధంగా దశల వారీగా 460 మంది సీనియర్ మేట్లుగా మిగిలిపోయారు. ఇదే



విధానం అమలు చేస్తే రాబోయే రోజుల్లో పూర్తిగా ఉపాధికి దూరమవుతారనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో టార్గెట్లను ఉపసంహరించుకుని ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం నెలకు రూ.26వేలు అమలు చేయాలనే డిమాండ్ ముందుకొస్తోంది.

అందని ద్రాక్షలా టార్గెట్లు

ఏడాదిలో గ్రామంలో 7,500 పని దినాలు కల్పించిన వారిని ఎ-గ్రేడ్‌లో చేర్చి వారికి నెలకు రూ.8,900 వేతనం, రూ.350 అలవెన్స్ ఇస్తున్నారు. 7,500-6,500 మధ్య పని దినాలు కల్పించిన వారిని బి-గ్రేడ్‌గా పరిగణించి రూ.7,900 వేతనం, రూ.350 అలవెన్స్‌లు, 5వేల నుంచి 6,500 మధ్య పనిదినాలు కల్పించిన వారిని సి-గ్రేడ్‌గా పరిగణించి రూ.6,400 వేతనం, రూ.350 అలవెన్స్‌లు ఇస్తున్నారు. 5వేల కంటే తక్కువ పని దినాలు కల్పించిన వారికి జీతాలు ఉండవు. వీరిని సీనియర్ మేట్‌గా పరిగణిస్తారు. ఈ విధంగా జిల్లాలో 460 మంది సీనియర్ మేట్లుగా మిగిలిపోయారు. గ్రేడ్ల కోటాలో కొందరికి మాత్రమే జీతాలు చెల్లించి మిగిలిన వారికి మొండిచేయి చూపిస్తూ పొమ్మన కుండా పొగబెడుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితిని చక్కదిద్దాలని కోరుతున్నారు.

మూడు నాలుగు నెలలే పనులు..

ఉపాధి హామీ పనులు ఏడాదంతా సాగడం లేదు. వేసవిలో మూడు నుంచి నాలుగు నెలలకు మించి పనులు ఉండట్లేదు. ఫిబ్రవరి, మే వరకే కాస్త హడావుడి కనిపిస్తోంది. మిగతా రోజుల్లో వ్యవసాయ పనులు ఉన్నందున ఆశించిన స్థాయిలో పనులు జరగడం లేదు. ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో రెండేళ్లుగా వ్యవసాయ పనుల్లో జనం బిజీగా ఉండటంతోనూ ఉపాధి పనులు పెద్దగా సాగడం లేదు. ఈ పరిస్థితులలో తమ ఉద్యోగ భద్రత కరువైందని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో దశల వారీ ఆందోళనలను ప్రారంభించారు. మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామ పంచాయతీలలో ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రత్యామ్నాయం చూపించాలని కోరుతున్నారు. అదే విధంగా ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 వేతనం కల్పించి 200 రోజులు పని కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అర్హత, అనుభవం కల్గిన ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రమోషన్, మండల స్థాయిలో బదిలీల సౌకర్యం కల్పిలంచాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదవశాత్తు మరణించిన వారికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, జూనియర్ మేట్, సీనియరల్ మేట్, ఫీల్డ్ అసిస్టెంట్ అనే తారతమ్యం లేకుండా అందరినీ ఫీల్డ్ అసిస్టెంట్లుగా పరగణించి వేతనాలు చెల్లించాలని కోరుతున్నారు.

కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి



ప్రభుత్వ నిబంధనలతో ఈ రంగంలో పనిచేసే వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది. పనిదినాల లక్ష్యం విధానం రద్దు చేయాలి. కనీస వేతనం నెలకు రూ.26వేలు చెల్లించాలి. నగర పంచాయతీల్లో కలిసిన గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపించాలి. 17 ఏళ్లుగాఈ రంగంలో పనిచేస్తున్న వారిని సచివాలయ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలి.

- ఎఎన్‌వి.మహేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్యఅతిథులు, బాలోత్సవం నిర్వాహకులు

బాలోత్సవంతో సృజనాత్మకత వెలికితీత

బ్రోచర్ ఆవిష్కరణలో వక్తలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు బాలోత్సవం కార్యక్రమం దోహదం చేస్తాయని పలువురు వక్తలు అన్నారు. గోదావరి బాలోత్సవం 2వ పిల్లల పండుగను జనవరి 27, 28 తేదీల్లో రాజమహేంద్ర వరంలోని ఎస్‌కెవిటి డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన సంఘం బ్రోచర్ ఆవిష్కరణ సభ మంగళవారం సాయంత్రం 6 గంటలకు రాజమహేంద్రవరంలోని హోటల్ షెల్టాన్‌లో జరిగింది. ఈ సభకు సీనియర్ పాత్రికేయులు కృష్ణకుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా తిరుమల విద్యాసంస్థల అధినేత, గోదావరి బాలోత్సవం అధ్యక్షులు నున్న తిరుమలరావు హాజరై మాట్లాడారు. పిల్లలో సృజనాత్మ కతను వెలికితీయడానికి బాలోత్సవాలు దోహదం చేస్తాయన్నారు. డిసిసిబి ఛైర్మన్ ఆకుల వీర్రాజు మాట్లాడుతూ బాలోత్సవాలను ప్రోత్సహించాల న్నారు. దీనికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. సిసిసి అధినేత పంతం కొండలరావు మాట్లాడుతూ రాజమహేంద్ర వరంలో జరిగిన గత బాలోత్సవం చాలా బాగా జరిగిందన్నారు. ఈ ఏడాది కూడా అంతే ఘనంగా నిర్వహించాలన్నారు. దీనికి తన సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం నిర్వాహకులు గుబ్బల రాంబాబు, మాటూరు సిద్దార్థ, స్వామి యాడ్స్ అధినేత జి.భాస్కర్, గోదావరి బాలోత్సవం నిర్వాహకులు పిఎస్ఎన్.రాజు, పి.తులసి, జె.రూపస్, డాక్టర్ చైతన్య శేఖర్‌లు మాట్లాడారు. ఈ సభకు నగరం లోని ప్రముఖులు, టీచర్స్ , రిటైర్డ్ ఉద్యోగులు, బాలోత్సవం నిర్వాహకులు పాల్గొన్నారు. తొలుత గోదావరి బాలోత్సవం గౌరవాధ్యక్షులు, పిడిఎఫ్ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మృతికి సమావేశం సంతాపం తెలియజేసింది.



బ్రోచర్ ఆవిష్కరణ సభలో మాట్లాడుతున్న తిరుమల విద్యాసంస్థల అధినేత తిరుమలరావు

నేటి నుంచి సమ్మెలోకి సమగ్ర శిక్ష ఉద్యోగులు

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండలం సమగ్ర శిక్ష ఉద్యోగ సిబ్బంది ఉద్యోగులు సమ్మె బాట పట్టనున్నారు. నాలుగు రోజులుగా వారు పెన్‌డౌన్‌తో నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో బుధవారం నుంచి సమ్మెకు వెళ్తున్నారు. వీరి సమ్మెకు యుటిఎఫ్, ఎపిటిఎఫ్, టిఎన్‌యుఎస్, బిటిఎస్ సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. న్యాయబద్ధమైన 15 డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి పి.రవివర్మ మాట్లాడుతూ నాలుగు నెలలుగా సమగ్ర శిక్ష సిబ్బందికి జీతాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. జీతాలు లేకుంటే వారు ఎలా జీవిస్తారని ప్రశ్నించారు. రవికుమార్ మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. 2022 పిఆర్‌సి ప్రకారం వేతనాలు అందించాలన్నారు. సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాసమూర్తి, టి.నారాయణరావు, బి.రవికుమార్, వై.నాగరాజు సంఘ సభ్యులు టిఎన్ఇఎస్ నాయకులు బి.మధుశేఖర్, బిటిఎస్ నాయకులు డి.ప్రభుకుమార్, ఎపిటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



సమ్మె నోటీసు అందిస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు



స్టడీ మెటీరియల్ అందిస్తున్న రాంబాబు

స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరం ఎంవిఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 200 మంది పదోతరగతి, ఇంటర్ విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ మెటీరియల్‌ను యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ఐ.రాంబాబు మంగళవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది కూడా ఈ మెటీరియల్ చదివిన విద్యార్థులు ఉత్తీర్ణులై, మంచి గ్రేడు పాయింట్లతో ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారన్నారు. ఈ ఏడాదీ అటువంటి ఫలితాలు రావడానికి ఈ మెటీరియల్ ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. తన సొంత నిధులు రూ.20వేలతో వీటిని సమకూర్చానని తెలిపారు. తొలుత ఎంఎల్‌సి షేక్ సాబ్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రాంబాబును హెచ్‌ఎం వి.విశ్వప్రసాద్, ఉపాధ్యాయులు ఉదయ భాస్కర్, ఆళ్ల సుబ్బారావు, దుర్గాప్రసాద్, అజూబా, నాగసుందరి, పద్మావతి, పద్మజారాణి, నాగజ్యోతి తది తరులు అభినందించారు. .

అంగన్‌వాడీల బిక్షాటన

8వ రోజుకు నిరవధిక సమ్మె
రోజురోజుకూ పెరుగుతున్న ప్రజల మద్దతు
బిక్షాటన, వంటావార్పులతోనిరసన

ప్రజాశక్తి - యంత్రాంగం

అంగన్‌వాడీల నిరవధిక సమ్మె జిల్లాలో కొనసాగుతోంది. మంగళవారం నాటికి 8వ రోజుకు చేరింది. వీరి సమ్మెకు రోజురోజుకూ మద్దతు పెరుగుతోంది. బిక్షాటన చేస్తూ, వంటావార్పు నిర్వహిస్తూ, చెవులో పూలుతో అంగన్‌వాడీలు నిరసన తెలిపారు.

రాజమహేంద్రవరం ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలపిఆరు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ఎస్.మూర్తి, జిల్లా కమిటీ సభ్యులు బి.పవన్ మాట్లాడారు. ఎనిమిదిరోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదన్నారు హామీలు అమలు చేయమంటే బెదిరింపులకు పాల్పడటం ఏంటని? ప్రశ్నించారు. వెంటనే అంగన్‌వాడీల వేతనాలు పెంచాలని, గ్రాడ్యూటీ అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇతర సమస్యలు పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. నాయకత్వంతో చర్చలు జరిపి సమ్మెను విరమింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు శారద, సునీత, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. **కొవ్వూరు** ఆర్‌డిఒ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు సమ్మె శిబిరాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.సుందర్ బాబు, ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ మద్దతుగా పాల్గొని మాట్లాడారు. ఒక పక్క తెలంగాణాలో వేతనాలు పెంచుతుంటే ఇక్కడ మాత్రం హామీలను కూడా అమలు చేయట్లేదని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి అంగన్‌వాడీలందరూ సిద్ధపడాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల అద్దెలను సైతం చెల్లించట్లేదన్నారు. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను తక్షణం నెరవేర్చాలన్నారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.మాణిక్యాంబ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. న్యాయవాది టివి.రామారావు, ఎంపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.పోచమ్మ తదితరులు మంగళవారం సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో వసంతాడ శ్రీదేవి, చీర దుర్గాభవాని, బి.పద్మజ, ఎ.నరసమాంబ తదితరులు పాల్గొన్నారు. **ఉండ్రాజవరంలో** అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెకు తాడిపర్రు, కె.సావరం, సూర్యారావుపాలెం గ్రామాల సర్పంచులు మద్దతు తెలిపారు. పెరవలి ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ఈ ధర్నా జరిగింది. ఈ కార్యక్రమంలో కరుటూరి నరేంద్రబాబు, నార్ని రామకృష్ణ, మెండే శ్రీనివాస్, ఉండ్రాజవరం సెక్టార్ లీడర్ ఎస్.రంగనాయకమ్మ, పెరవలి ప్రాజెక్టు ప్రెసిడెంట్ కె.లక్ష్మీకుమారి, ఎం.జానకి, కెఎన్ఎస్.ప్రసన్నకుమారి, సిహెచ్.జ్యోతి, జి.సువర్ణలత, ఉషారాణి, పి.గిరిజ, నిర్మల పాల్గొన్నారు. **గోకవరం** తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె ఎనిమిదో రోజుకు చేరింది. గోకవరం, కోరుకొండ మండలాలకు చెందిన అంగన్‌వాడీలు సమ్మెలో పాల్గొన్నారు. తొలుత తహశీల్దార్ కార్యాలయం నుంచి గోకవరంలో దేవిచౌక్ సెంటర్ వరకు ర్యాలీ, అనంతరం మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు అన్నపూర్ణ, కోరుకొండ ఐసిడిఎస్ ప్రాజెక్టు అధ్యక్షులు మాలతి, సెక్టర్ లీడర్స్ విజయ్ కుమారి, భాస్కరం మాట్లాడారు. డిమాండ్లను నెరవేర్చేవరకూ సమ్మె ఆపేది లేదని స్పష్టం చేశారు. **గోపాలపురంలో** నిర్వహించిన అంగన్‌వాడీల సమ్మెకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.భగత్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణ రాజు పాల్గొని మద్దతుత ఎలిపారు. ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద చేపట్టిన ఈ సమ్మెలో గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల మండలాలకు చెందిన అంగన్‌వాడీలు పాల్గొన్నారు. వంటావార్పు నిర్వహించారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించి, చెక్ పోస్ట్ సెంటర్లో మానవహారం చేపట్టి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు కె.వెంకట్రావు, సిపిఎం సీనియర్ నాయకులు ఉండవల్లి కష్ణారావు, జన విజ్ఞాన వేదిక నాయకులు వై.పైడియ్య, సిఐటియు మండల అధ్యక్షురాలు రామలక్ష్మి, జనసేన నాయకులు పోసిన గణపతి, వడ్డి లీలాధర్, ం గెద్దాడ సత్యనారాయణ, పి.రమేష్, సబ్బిత శ్రీను, మణికంఠ, శ్యామ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. **పెరవలి** లో అంగన్‌వాడీలు ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. యూనియన్ పెరవలి ప్రాజెక్ట్ గౌరవ అధ్యక్షులు జువ్వల రాంబాబు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. పలువురు సర్పంచులు మద్దతుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి, మేరీ విక్టోరియా, సూర్యాకాంతం, జానకి, కన్యాకుమారి, ధనలక్ష్మి, గంటా మాధవి తదితరులు పాల్గొన్నారు.



బిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీలు



రాజమహేంద్రవరంలో చెవిలో పూలతో అంగన్‌వాడీల నిరసన



కొవ్వూరులో ఒంటికాలిపై నిలబడి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



గోకవరంలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

కార్టూ'నిజం'



సారు ఎన్ని అప్పులు చేసినా
చీమకుట్టినట్టయినా వుండదేం..!!!

నేడు మెడికల్ రిప్స్ సమ్మె

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఆలిండియా మెడికల్, సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ఒక రోజు సమ్మె చేస్తున్నట్లు యూనియన్ నాయకులు తెలిపారు. దేశంలో ఉన్న దాదాపు 3లక్షల సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయ్స్ ఈ సమ్మెలో పాల్గొంటారని తెలిపారు. మంగళవారం నగరంలోని పేపర్‌మిల్లు వద్ద గల బిటిఆర్ భవనంలో జరిగిన వర్కింగ్ కమిటీ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ఎన్.సత్తిరాజు మాట్లాడారు. సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ యాక్ట్ 1976 ప్రకారం దేశంలో సేల్స్ రంగంలో పనిచేస్తున్న రిప్రజెంటేటివ్స్‌కు ఐడి యాక్ట్, బోనస్ యాక్ట్, లీవ్ రూల్స్ వంటి చట్టాల ద్వారా ఉద్యోగాలను ఇప్పటివరకు కాపాడుకున్నామన్నారు. మోడీ ప్రభుత్వం వచ్చాక ఎస్‌పిఇ యాక్ట్‌ని తొలగించి ఉద్యోగుల భవిష్యత్‌ని యాజమాన్యాల చెప్పుచేతల్లో నెట్టివేయడం దారుణమన్నారు. అంతేకాకుండా 44 కార్మిక చట్టాలను తొలగించి నాలుగు కోడ్స్ తేవడం తగదన్నారు. అన్ని రకాల ఔషదాలు, వైద్య పరికరాలపై జిఎస్‌టిని రద్దు చేయాలన్నారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన దానేశ్వరరావు మాట్లాడుతూ, సేల్స్ ప్రమోషన్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు విధి విధానాలను నిర్ణయం చేసి చట్టభద్దత కల్పించాలని డిమాండ్ చేశారు. రాజమండ్రి కార్యదర్శి కె.రామారావు మాట్లాడుతూ, మందుల కంపెనీల యాజమాన్యాలు డిజిటల్ టెక్నాలజీని ఉపయోగించి ఉద్యోగుల గోప్యతను, వారి వ్యక్తిగత స్వేచ్ఛతకు భంగం కలిగిస్తున్నారన్నారు. జిపిఎస్, జిపిఆర్‌ఎస్‌లను ఉపయోగించి చట్టవిరుద్ధంగా ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారన్నారు. ట్రాకింగ్, సర్వేలెన్స్‌ని రద్దు చేయాలన్నారు. పనిప్రదేశాల్లో ఎటువంటి అడ్డంకులు లేకుండా చూడాలన్నారు. ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా, పిలుపు మేరకు సమ్మెను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో కోశాధికారి గోపాల్, జాయింట్ సెక్రటరీ రాంబాబు, చందు, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు



సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు



పనులను పరిశీలిస్తున్న జెసి తేజ్ భరత్

బిఎంసియు, ఎంపిఎఫ్‌సిలను పూర్తి చేయాలి

ప్రజాశక్తి - రాజానగరం

బిఎంసియు, ఎంపిఎఫ్‌సి నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని జెసి ఎన్.తేజ్‌భరత్ అధికారులను ఆదేశించారు. రాజానగరం మండలం ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో నిర్మాణంలో ఉన్న బల్క్ మిల్క్ కూలింగ్ కేంద్రాన్ని, మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్ నిర్మాణ పనులను ఆయన మంగళవారం పరిశీలించి మాట్లాడారు. ఈ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. రూ.15.74 లక్షలతో నిర్మిస్తున్న బల్క్ మిల్క్ కూలింగ్ కేంద్రం 80 శాతం పనులు పూర్తి అయ్యాయన్నారు. నిర్మాణ పనులకు సంబంధించి చెల్లింపుల విషయంలో ఏమైనా ఇబ్బందులుంటే తమ దృష్టికి తేవాలన్నారు. రూ.50 లక్షలతో నిర్మిస్తున్న మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్‌కు నిర్మాణ పనులు పూర్తి అయ్యాయని, ప్రస్తుతం షీటింగ్ పనులు జరుగుతున్నట్టు జెసికి అధికారులు తెలిపారు. ఆయన వెంట పంచాయతీ రాజ్ ఎస్ఇ ఎబివి.ప్రసాద్, ఎంపిడిఒ ఎం.సుబ్రహ్మణ్యం, ఎఇపిఆర్ సంపత్, డిప్యూటీ తహశీల్దార్ సునీత, అధికారులు, కాంట్రాక్టర్లు ఉన్నారు.

ఎన్నికల్లో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకం

సమావేశంలో కలెక్టర్ మాధవీలత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకమైందని, ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలు కచ్చితంగా అమలు చేయాల్సి ఉంటుందని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. మంగళవారం జిఎస్ఎల్ ఆడిటోరియంలో తూర్పు గోదావరి జిల్లా పరిధిలో గల సెక్టోరల్ అధికారులు, సెక్టార్ పోలీస్ అధికారులతో ఎన్నికల ప్రక్రియపై కలెక్టర్ మాధవీలత, ఎస్‌పి పి.జగదీష్, జెసి ఎన్.తేజ్‌భరత్, మున్సిపల్ కమిషనర్ కె.దినేష్‌కుమార్, సహాయ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, డిఆర్ఒ జి.నరసింహులుతో కలిసి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెక్టోరల్ సెక్టార్ అధికారులు ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. సమన్వయంతో పని చేయాలన్నారు. గతంలో పనిచేసినా ఇంకా ఎంతో కొంత నేర్చుకోవాల్సింది ఉంటుందన్నారు. సెక్టోరల్ అధికారులు తమ పరిధిలోని ప్రతి పోలింగ్ స్టేషన్ సందర్శించాలన్నారు. పోలింగ్ స్టేషన్లపై, రూట్ మ్యాప్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా సజావుగా ఎన్నికల నిర్వహణ కోసం సెక్టోరల్, సెక్టార్ ఆఫీసర్లు వారి పరిధిలో ఉన్న పోలింగ్ స్టేషన్‌ల మధ్య తిరుగుతూ ఉంటూ ఆయా ఓటింగ్ పక్రియలో వినియోగిస్తున్న ఇవిఎం, వివిప్యాడ్‌ల పనితీరుపై వివరాలు సేకరించాలాన్నారు. అవసరమైన పక్షంలో ఏదైనా ఇవిఎం, వివిప్యాడ్‌లను భర్తీ చేయడాన్ని నిర్ధారణ చేసే కీలక బాధ్యత వారిపై ఉందని పేర్కొన్నారు. ప్రతి ప్రిసైడింగ్ అధికారికి అందుబాటులో ఉండడంతో పాటు నిరంతరం సంప్రదింపులు జరపాల్సి ఉంటుందన్నారు. ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయమైన పద్ధతిలో అంతరాయాలు లేకుండా నిర్వహించే బాధ్యత సెక్టరల్ అధికారిదేనన్నారు. సెక్టోరల్ అధికారి చేయాల్సిన, చేయకూడని వాటిపై బుక్ లెట్స్ అందిస్తామన్నారు. వాటిని పూర్తి స్థాయిలో చదివి సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని మాధవీలత సూచించారు.

జిల్లాలోని 7 నియోజక వర్గాల పరిధిలో 175 సెక్టార్లలోఅధికారుల్ని, పోలీసు అధికారులను నియమిస్తున్నట్లు ఎస్‌పి పి.జగదీష్ తెలిపారు. సెక్టోరల్ అధికారుల పనులు, బాధ్యతలు, ముందస్తు ఎన్నికల బాధ్యత, పోలింగ్ స్టేషన్ల గురించి, పోలింగ్ రోజున బాధ్యతలు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై సమగ్ర సమాచారంపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

జెసి ఎన్.తేజ్‌భరత్ మాట్లాడుతూ సెక్టోరల్ అధికారి ఒక సెక్టార్‌కు ఇన్‌ఛార్జిగా ఉంటారన్నారు. ఒకొక్క సెక్టార్‌కి ఇద్దరు చొప్పున సెక్టోరల్ అధికారులను నియమించామని తెలిపారు. ఆమేరకు జిల్లాలో 175 మంది అధికారులు , 175 మంది పోలీసు అధికారులను నియమించామని తెలిపారు. సెక్టోరల్ ఆఫీసర్లు పోలింగ్ జరిగిన మొదటి రెండు గంటల్లో అన్ని పోలింగ్ స్టేషన్‌లను సందర్శించి, పోలింగ్ స్టేషన్‌ల కోసం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి పోల్ ప్రారంభ నివేదికను అందించాలన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్ర సమాచారాన్ని వివరించారు. ఈ సమావేశంలో డిఆర్ఒ జి.నరసింహులు, నియోజక వర్గ ఎన్నికల అధికారులు ఎ.చైత్రవర్షిణి, ఎబివిఎస్‌బి.శ్రీనివాస్, కృష్ణనాయక్, ఎం.ఝాన్సీరాణి, ఎస్.సరళావందనం, ఎం.వెంకటసుధాకర్, సహాయ ఇఆర్ఒలు, తహశీల్దార్లు, కలెక్టరేట్ ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్



హాజరైన అధికారులు

వినియోగదారుల రక్షణ చట్టంపై అవగాహన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

వినియోగదారుల రక్షణ చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డిఎస్ఒ పి.విజయభాస్కర్ అన్నారు. మంగళవారం జిల్లా పౌర సరఫరాల శాఖ, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల కన్స్యూమర్ క్లబ్ ఆధ్వర్యంలో వినియోగదారుల రక్షణ చట్టంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విజయభాస్కర్ హాజరై మాట్లాడారు. ప్రతిఒక్కరూ వినియోగదారుల రక్షణ చట్టం-2019పై అవగాహన కలిగి ఉండాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి కొనుగోలుపై బిల్లు తప్పక తీసుకోవాలని సూచించారు. నాణ్యమైన వస్తువులు కొనుగోలు చేయాలన్నారు. ఆకర్షణీయమైన వ్యాపార ప్రకటనలు చూసి మోసపోకూడదన్నారు. పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. సివిల్ సప్లయిస్ కమిషనర్ ఆదేశాల మేరకు డిసెంబర్ 18 నుంచి 24వరకూ వినియోగదారుల వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామచంద్రరావు మాట్లాడుతూ విద్యార్థులు, ముఖ్యంగా యువత వినియోగదారుల చట్టాలపై అవగాహన కలిగి ఉండటం వల్ల మోసాలకు గురికాకుండా ఉంటారన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ అసిస్టెంట్ మేనేజర్ టి.త్రినాథస్వామి, రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యులు గొట్టిముక్కల అనంతరావు, కళాశాల కామర్స్ హెచ్‌ఒడి సత్యనారాయణ, అధ్యాపకులు లీలా మోహన్, సత్రిష్, ఫణిదర్, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

రోడ్డుపైకి వెళ్లేదెలా..?

సిసి రోడ్డుకు అనుసంధానం లేక ఇబ్బందులు

ప్రజాశక్తి - గోపాలపురం

రోడ్డు వేసి అప్రోచ్‌లు మరవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మండలంలోని చిట్యాల నుంచి దుద్దుకూరు వరకు, గోపాలపురం నుంచి యాదవోలు వరకు రోడ్లు నిర్మించారు. పాత రోడ్డు కంటే సిమెంట్ రోడ్డు రెండు అడుగుల ఎత్తు పెంచారు. అయితే ఈ రోడ్డు ఆనుకుని ఉన్న అప్రోచ్ రోడ్లకు సంబంధించి జాయింట్లు కలపకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. వాహదారులు రెండు అడుగులు ఎత్తు నుంచి వాహనం దింపలేక నానా అగచాట్లు పడుతున్నారు. చిట్యాలలోని మండల పరిషత్ ప్రాథమిక స్పెషల్ పాఠశాల వద్ద ఇదే పరిస్థితి ఉంది. ఇక్కడ డ్రెయినేజీ పూడిక తీత కూడా లేకపోవడంతో మురుగునీరు నిలిచిపోతోంది. విద్యార్థులు రోడ్డు దిగే క్రమంలో అందులో పడిపోతున్నారు. అంతేకాకుండా మురుగునీటిలో నుంచే విద్యార్థులు పాఠశాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ గ్రామంలో సుమారు ఐదు ప్రదేశాల్లో జాయింట్లు కలపాల్సింది. గోపాలపురంలో ఉప్పరగూడెంలో ఉన్న ఆర్ అండ్ బి సిమెంట్ రోడ్డు, వీధిలోని సిమెంట్ రోడ్డుకు ఎత్తుకు సమానంగా జాయింట్ కలపకపోవడంతో గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆర్ అండ్ బి అధికారులు, పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఏడాదిగా గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గోపాలపురం నుంచి చిట్యాల వరకు గల ఆర్ అండ్ బి రోడ్డు మార్గంలో ఉన్న కల్వర్టు వేలచింతలగూడెం వద్ద ఒక కల్వర్టు, పెద్దాపురంలో ఉన్న కల్వర్టు పనులు చేపట్టి సంవత్సరకాలం పూర్తవుతుంది అయినప్పటికీ ఆర్ అండ్ బి రోడ్డుకు కల్వర్టు మధ్యలో (బీటీ)తారు రోడ్డు వేసి కలపవలసి ఉండగా గుత్తేదారుడు తూతూ మంత్రంగా కల్వర్టు నిర్మాణం చేపట్టిన ప్రాంతంలో ఆర్ అండ్ బి రోడ్డుకు చట్రు వేసి చేతులు దులిపేసుకున్నాడు. మట్టి దిగిపోవడంతో గోతులు ఏర్పడ్డాయి. దీంతో ఇక్కడ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అప్రోచ్ రోడ్లకు జాయింట్లు కలపాలని పలువురు కోరుతున్నారు.


పాఠశాల వద్ద రోడ్డుపైకి చేరుకోలేని పరిస్థితిని చూపుతున్న స్థానికులు

హరిత నిలయంగా దుళ్ల-1 పాఠశాల

ప్రజాశక్తి-కడియం

ఆ పాఠశాల లో పచ్చదనానికి పెద్ద పీట వేస్తున్నారు. వివిధ మొక్కలు పెంచుతూ పాఠశాలను ఆహ్లాదంగా తీర్చిదిద్దుతున్నారు. అలాగే విద్యార్థులను చదువుల్లో రాణించేలా తర్ఫీదునిస్తున్నారు. గత విద్యా సంవత్సరంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షల్లో పాఠశాల విద్యార్థులు ముగ్గురు విజయం సాధించి పెద్దాపురం నవోదయలో సీట్లు పొందారు. మండలంలోని దుళ్లలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నెం 1 ప్రధానోపాధ్యాయులు గెడ్డం ఆనంద్ ప్రత్యేక శ్రద్ధతో విద్యార్థులుతో కలిపి వున్న కొద్దిపాటి ఆవరణలో సేంద్రియ విధానంలో తోటకూర, గోంగూర, కొత్తిమీర లాంటి ఆకుకూరలు వంగ, బెండ, టమోటా లాంటి కూరగాయలు పండిస్తున్నారు. వీటినే మధ్యాహ్న భోజనంలో వినియోగిస్తూ పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక చొరవ కనబరుస్తున్నారు. అన్నివిధాలా గ్రామ పెద్దలు,తోటి ఉపాధ్యాయులు అన్యం దొరబాబు తదితరులు సహకరించడం పట్ల హెచ్ఎం సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


పాఠశాలలో కూరగాయల మొక్కలు


పచ్చదనంతో కళకళ్లాడుతున్న పాఠశాల

25న కేంద్ర మంత్రి యానాం రాక

ప్రజాశక్తి - యానాం

కేంద్ర మత్స్యశాఖ, సమాచార,ప్రసార మంత్రిత్వశాఖల సహాయమంత్రి ఎల్.మురుగన్, రాజ్యసభ సభ్యుడు, పుదుచ్చేరి బిజెపి అధ్యక్షుడు సెల్వగణపతి ఈ నెల 25న యానాం రానున్నట్లు యానాం బిజెపి శాఖ అధ్యక్షుడు రాజు తెలిపారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

డోమెస్టిక్ సిలిండర్ల వినియోగంలో అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇన్‌ఛార్జి రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎ.సురేష్‌బాబు హెచ్చరించారు. మంగళవారం సురేష్‌బాబు ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు టి.నగర్‌లోని హోటల్ మణికంఠలో దాడులు చేశారు. అక్రమంగా వినియోగిస్తున్న ఆరు డొమెస్టిక్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. హోటల్ యజమాని అయ్యల సోమజాజులరామకృష్ణపై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో కార్యాలయ సబ్ ఇన్‌స్పెక్టర్ జగన్నాథరెడ్డి, జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ, హెడ్‌కానిస్టేబుల్ జీవానందం, కానిస్టేబుల్ లోవకుమార్, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు పాల్గొన్నారు.

యువగళం ముగింపు సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం:

విజయనగరం జిల్లా పోలిపల్లిలో బుధవారం నిర్వహించనున్న యువ గళం-నవశకం బహిరంగ సభకు నిడదవోలు నియోజకవర్గం నుంచి అభిమానులు, కార్యకర్తలు భారీగా హాజరుకావాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బూరుగుపల్లి శేషారావు పిలుపునిచ్చారు. ఆయన ఆధ్వర్యంలో 200 కార్లు, బస్సుల్లో సుమారు 1,800 మంది టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉదయం 7 గంటలకు, వేలివెన్ను గ్రామం నుంచి బయలుదేరుతారన్నారు.


కొవ్వొత్తులో క్రిస్మస్ గ్రీటింగ్ చెప్పకుంటున్న క్రైస్తవులు

ఘనంగా యూత్ క్రిస్మస్

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురం ఉప్పరగూడెంలో మాదిగ మహారాజ్ యువజన సంఘం ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. యూత్ సభ్యులు మాట్లాడుతూ 11 ఏళ్లుగా క్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా భారీ క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి పంచారు. క్యాండిల్ సర్వీసింగ్ ఎంతో ఆకట్టుకుంది. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చిన్నారులకు క్రిస్మస్ కానుకలను అందించారు. అనంతరం క్రిస్మస్ విందు ఇచ్చారు.

ప్రసాద్‌కు జనసేన నాయకుడు రవి పరామర్శ

ప్రజాశక్తి - పెరవలి

మండలం జనసేన ఆత్మీయ సమావేశానికి వస్తూ రోడ్డుప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉసులుమర్రుకు చెందిన కార్యకర్త చౌదళ్ల ప్రసాద్‌ను జనసేన మండల అధ్యక్షులు పిప్పర రవి మంగళవారం పరామర్శించారు. తణుకులో ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతన్ని రవి పరామర్శించి కుటుంబ సభ్యులకు వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించారు. జనసేన పార్టీ తోడుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు తులా చినబాబు, పాలా వీరాస్వామి, ప్రముఖ న్యాయవాది అనుకూల రమేష్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు నందిప చక్రవర్తి, వీరవల్లి శ్రీను, ప్రత్తిపాటి ప్రసాద్, మారిసెట్టి రాంబాబు, సంగీత నాగు, రేలంగి రాజేష్, మేకల చక్రి పాల్గొన్నారు.


సాయం అందిస్తున్న రవి తదితరులు



ఆర్‌బికె ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంఎల్‌ఎ నాయుడు తదితరులు

పలు భవనాలకు ప్రారంభోత్సవాలు

ప్రజాశక్తి - పెరవలి

మండలంలో పలు ప్రభుత్వ భవనాలకు ఎంఎల్ఎ జి.శ్రీనివాస్‌నాయుడు మంగళవారం ప్రారంభోత్సవాలు చేశారు. అన్నవరప్పాడులో రూ.25.34 లక్షలతో నిర్మించిన ఆర్‌బికె భవనం, రూ.26.50 లక్షలతో నిర్మించిన డాక్టర్ వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం, రూ.27 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం ప్రారంభించారు. రూ.90లక్షలతో పైపు లైన్, కుళాయి పనులకు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో వైసిపి ప్రభుత్వ పలు అభివృద్ధి పనులను చేసిందన్నారు. పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పంతం బాలాసుందరి, వైసిపి నాయకులు పంతం సత్యనారాయణ, ఉప సర్పంచ్ పులపర్తి శక్తిప్రసాద్, ఎంపిపి కె.సీతారాంప్రసాద్, వైసిపి మండల అధ్యక్షులు వీరమల్లు సత్యనారాయణ సొసైటీ అధ్యక్షులు పంతం నాగేశ్వరరావు, ఎంపిడిఒ సింగంశెట్టి రమేష్, పిహెచ్‌సి వైద్యులు ఎహెచ్.విజయకుమార్, ఎఒ మేరీ కిరణ్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఆకాష్ పుట్టిన రోజు

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని కోమటికుంట పంచాయతీ సర్పంచ్ వెలగా ప్రమీల కుమారి, వెలగా శ్రీరామ్మూర్తి దంపతుల ద్వితీయ కుమారుడు ఆకాష్ పుట్టినరోజును ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మధ్య పుట్టిన రోజును నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఆకాష్‌తో కేక్ కట్ చేయించి పంచారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంచి విందు ఏర్పాటు చేశారు. ఆకాశ్‌కు గ్రామస్తులు, వైసిపి నాయకులు, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.


విద్యార్థుల మధ్య కేక్‌ను కట్ చేస్తున్న ఆకాష్

నేరాలు ఘోరాలు

పేకాట శిబిరంపై దాడి

ఏడుగురు అరెస్ట్

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని పల్లిపాలెం నందు పేకాట నిర్వహిస్తున్న శిబిరంపై పోలీసులు మంగళవారం ఆకస్మికంగా దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో వారి వద్ద నుంచి రూ.2700 రూ.నగదు తోపాటు ఐదు మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. పల్లిపాలెం లో పేకాట నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ట్రైనీ డిఎస్ఇ విష్ణు స్వరూప్ స్థానిక ఎస్ఐ ఎస్ శివప్రసాద్ ల ఆధ్వర్యంలో ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 7 వ్యక్తులు పట్టుబడగా వారిపై కేసు నమోదు చేసి స్థానిక కోర్టులో హాజరు పరిచినట్లు ట్రైనీ డిఎస్పి తెలిపారు.

వ్యాన్‌లో షార్ట్ సర్క్యూట్

డ్రైవర్ సజీవదహనం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

మినీ వ్యాన్‌లో షార్ట్ సర్క్యూట్ అవ్వడంతో ఒక వ్యక్తి సజీవదహనం అయ్యాడు. ఈ సంఘటన కాకినాడ రూరల్ మండలం వాకలపూడి ఇండస్ట్రియల్ ఏరియాలో చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే సామర్లకోట మండలం పవర గ్రామానికి చెందిన బాలరాజు (70) వ్యాన్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈనేపథ్యంలో వాకలపూడి గ్రామం ఇండస్ట్రియల్ ఏరియాలో ఉన్న సంతోషి మాత ఆయిల్ కంపెనీకి లోడు నిమిత్తం మంగళవారం బయలుదేరి వెళ్లారు. ఈ నేపథ్యంలోనే మినీ వ్యాన్‌లో షార్ట్ సర్క్యూట్ అయ్యి మంటలు చెలరేగాయి. డోర్ తెరుచుకోకపోవడంతో వ్యాన్ డ్రైవర్ బాలరాజు సజీవదహనం అయ్యాడు. సంఘటనా స్థలాన్ని డిఎస్‌పి మురళీకృష్ణా రెడ్డి, తహశీల్దార్, సర్పవరం సిఐ ఆకుల మురళీ కృష్ణ పరిశీలించారు.

60 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

మండలంలోని వేట్లపాలెంలోని జొన్నలదొడ్డి ప్రాంతంలో మద్యం బెల్ట్ షాపుపై పోలీసులు దాడి చేశారు. పోలీసులకు అందిన ముందస్తు సమాచారంతో భక్తుల సత్యనారాయణకు చెందిన మద్యం బెల్ట్ షాపులో విక్రయించేందుకు సిద్ధం చేసిన 60 మద్యం బాటిల్ను స్వాధీనం చేస్తున్నట్లు సామర్లకోట సిఐ సురేష్ మంగళవారం తెలిపారు. మద్యం బాటిల్‌ను ఉంచిన షాపు యజమానిని అరెస్టు చేసి కాకినాడ కోర్టులో హాజరుపర్చినట్లు ఆయన తెలిపారు.

చిక్కాలలో 'వై ఎపి నీడ్స్ జగన్'

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని చిక్కాల-2 సచివాలకం, చిక్కాల పాలెంలో వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొయ్య మణి, ఎంపిటిసి సభ్యులు పిల్లి తిరుమల వెంకటేశ్వరరావు, ఎంపిపి మట్ట వీరాస్వామి, వైసిపి మండల అధ్యక్షులు దుర్గా మల్లేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ఎస్‌కె.ఖాసింసాహెబ్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

2వ రోజుకు శ్రమ మిత్రల శిక్షణ

ప్రజాశక్తి -గోకవరం

గోకవరం ఉపాధి హామీ పథకం కార్యాలయంలో శ్రమ మిత్రలకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు మంగళవారం నాటికి రెండో రోజుకు చేరాయి. ఎపిఒ పిఎస్.అప్పలరాజు ఆధ్వర్యంలో ఈ శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నారు. ం తిరుమలాయపాలెం, కామరాజుపేట, వెదురుపాక, రంప ఎర్రంపాలెం గ్రామపంచాయతీ పరిధిలో 40 మంది శ్రమ మిత్రలు హాజరయ్యారు. మస్తర్ల నిర్వహణ, మొబైల్‌లో ఎన్ఎంఎం ద్వారా హాజరు పంపడం, గ్రూపు నుంచి డిమాండ్ సేకరించుట, పని ప్రదేశంలో సౌకర్య కల్పన, రోజువారి వేతనం రూ.272 పొందేందుకు అవసరమైన కొలతలు వంటి వాటిపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అమూల్య, రత్నరాజు, పి.సింహాద్రి, బిజిఆర్.మోహన్‌రావు, ఎ.రాంప్రసాద్, సిబ్బంది, శ్రమ మిత్రలు పాల్గొన్నారు.

పోటీతత్వం అవసరం

ప్రజాశక్తి - తాళ్లపూడి

ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచి పోటీతత్వంతో చదువు కొనసాగిస్తూ అత్యున్నత శిఖరాలకు చేరుకోవాలని రాగోలపల్లి ఎంపిపి హెచ్ఎం దున్నా దుర్గారావు అన్నారు. భారతదేశ మొదటి మహిళా రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ జయంతిని మంగళవారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ప్రతిభా పాటిల్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దుర్గారావు పాటిల్ జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

.పేదలకు సేవ చేయడంలోనే సంతోషం

ప్రజాశక్తి - చాగల్లు

ప్రజలకు సేవ చేయడంలోనే సంతోషం ఉందని మల్లిపూడి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి మల్లిపూడి ధనరాజు అన్నారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం నందిగంపాడులో 10 నిరుపేద కుటుంబాలకు 15 కేజీల చొప్పున బియ్యాన్ని నాయకులు చీలి ప్రసాద్, కె.రాంబాబు, ఎ.శ్రీనివాస్, ఇ.కృష్ణ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా చీలి ప్రసాద్ మాట్లాడుతు మల్లిపూడి ధనరాజు పేదలకు సొంత నిధులతో ఇటువంటి సేవలు అందిచడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో శేషారావు, బక్కి ఆనందరావు, నరేంద్ర, శ్రీను, భూషణరావు తదితరులు పాల్గొన్నారు


బియ్యం అందిస్తున్న ధనరాజు